

హిరమండలం ఏఎంసీ ఏడీ బదిలీ

శ్రీకాకుళం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అగ్రికల్చరల్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ పరిధిలో అసిస్టెంట్ డైరెక్టర్‌లను ప్రభుత్వం సోమవారం బదిలీ చేసింది. జిల్లాలో హిరమండలం అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ఏడీఎం (స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ) ఎం.కాళేశ్వరరావు.. విజయనగరం జిల్లా బొబ్బిలి ఏఎంసీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విశాఖపట్నం ఏఎంసీ ఏడీఎం యాసిన్ బదిలీపై హిరమండలంలో నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులను జారీచేశారు.

మహిళలంటే అంత చులకనా?

- సాక్షి మీడియాలో వ్యాఖ్యలపై నిరసనాగ్రహం
- ఎచ్చెర్లలో కార్యాలయం వద్ద టీడీపీ శ్రేణుల ధర్నా
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు
- నేమ్‌బోర్డు తొలగించి.. పత్రికలు దహనం

ఎచ్చెర్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ మహిళా విభాగం నేతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. సాక్షి మీడియాలో ఇటీవల అమరావతి మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినవారితోపాటు ఆ మీడియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమ వారం ఉదయం ఎచ్చెర్లలోని సాక్షి కార్యాలయం వద్ద ధర్నా చేశా రు. కార్యాలయం ముందు బైఠాయించి.. అమరావతి మహిళలపై అమానుష వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నినా దాలు చేశారు. కొమ్మినేని శ్రీనివాస్ హోస్ట్‌గా నిర్వహించిన డిబేట్ లో జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తల దించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. మహిళలంటే అంత చుల కనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యత వహిం చి సాక్షి యాజమాన్యం తరఫున వైఎస్ భారతీరెడ్డి ప్రజలకు క్షమా పణ చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి దినపత్రికలను దహనం చేసి, కార్యాలయానికి చెందిన నేమ్‌బోర్డును తొలగించి మంటల్లో వేశారు. సాక్షి కార్యాలయం



సాక్షి నేమ్‌బోర్డు, పత్రికలను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



ఎచ్చెర్లలో సాక్షి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తెలుగు మహిళా నేతలు, టీడీపీ శ్రేణులు

గేటుకు చెప్పుల దండను వేలాడదీశారు. కార్యాలయం గేటు నుంచి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు సర్ది చెప్పడంతో శాంతించారు. డీఎస్పీ వివేకానంద, జేఆర్ పురం సీఐ అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ వి.నందీప్‌కుమార్, పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమీక్షించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్, ముప్పిడి సుజాత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వర రావు, ఎచ్చెర్ల మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, టీడీపీ నేతలు మెండ దాసునాయుడు, పైడి ముఖలింగం, బల్లాడ అరుణ, మెండ రాజారావు, కొత్తకోట అమ్మినాయుడు, జగదీష్‌బాబు, మూకళ్ల భాస్కరరావు, అల్లుపల్లి రాంబాబు, కైబాడి రాజు పాల్గొన్నారు.

కేఎస్ఆర్, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలి

- టెక్కలిలో పోలీసులకు తెలుగు మహిళల ఫిర్యాదు
- సాక్షి పత్రికలు దహనం చేసి.. నిరసన

టెక్కలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సాక్షి మీడియాలో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన.. ఆ చానెల్‌కు చెందిన కొమ్మినేని శ్రీనివాసరావు (కేఎస్ఆర్), కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని టెక్కలి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు పూజారి శైలజ, రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి మెట్ట పద్మావతి డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి టెక్కలిలో సాక్షి దినపత్రికలను దహనం చేశారు. అనంతరం కేఎస్ఆర్, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలంటూ సీఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడడం అవివేకానికి నిదర్శనం. అమరావతి అభివృద్ధిని చూడలేని జగన్ ఇలాంటి తప్పుడు వ్యక్తులతో విష ప్రచారాలు చేయిస్తున్నారు. కోట్లాదిమంది ఆంధ్రా మహిళలను మనోవేదనకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మట్ట సుందరమ్మ, మెండ దమయంతి, దేవాది సింహాద్రమ్మ, వాన లక్ష్మి, బెండి అన్నపూర్ణ, అల్లు తులసమ్మ, రూపమ్మ, అరుణ, హేమని, సునీత, నీరజ పాల్గొన్నారు.



టెక్కలిలో సాక్షి దినపత్రికను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

నాణ్యతా ప్రమాణాలతో రహదారులు నిర్మించాలి

- ఈ నెల 12 నుంచి 18లోపు శంకుస్థాపనలు చేయాలి
- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్న

టెక్కలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా ఉండాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశించారు. ఎక్కడైనా నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'రూ.1.75 కోట్లతో జాతీయ రహదారి నుంచి వయా చాకిపల్లి, డీపీఎస్ రోడ్డు వరకు, రూ.1.25 కోట్ల నాబార్డు నిధులతో కొల్లిపాడు-మేఘవరం రహదారి పనులు చేపట్టాలి. పంచాయతీరాజ్ పరిధిలో రూ.6కోట్లతో పెంటూరు నుంచి పొల్లాడ వరకు బీటీ రోడ్డు, రూ.1.95 కోట్లతో జల్లపల్లి నుంచి సీతారాంపల్లి వరకు, రూ.3కోట్లతో బడబంద నుంచి రౌతుపురం వరకు, రూ.1.10 కోట్లతో బీఆర్‌సీ పురం నుంచి సైలాడ వరకు అవసరమైన బీటీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాటామంతీ కార్యక్రమంలో భాగంగా రావివలసకు మంజూరు చేసిన రూ.15కోట్లతో వివిధ అభివృద్ధి పనులు శరవేగంతో ప్రారంభించాలి. ఈనెల 12 నుంచి 18లోగా పలు రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాల'ని ఆదేశించారు. అలాగే రైతులకు లాభసాటిగా ఉండేలా వరిని తగ్గించి ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెంచేలా చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ ఏడీ కరుకోల చిట్టిబాబుకు సూచించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ పి.సత్యనారాయణ, డీఈఈ రవికాంత్, పంచాయతీరాజ్ డీఈఈ సుధాకర్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- షైనింగ్ స్టార్స్ విద్యార్థులకు అవార్డుల ప్రదానం
- ప్రతిభను గుర్తించి.. ప్రోత్సహించాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.శ్రీనివాస్

శ్రీకాకుళం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కేంద్రపౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా షైనింగ్ స్టార్స్ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి కేంద్రమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులను సత్కరించారు. రూ.20వేలు చొప్పున నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

- అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ 'ప్రభుత్వం విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యార్థుల అభ్యున్నతిని గుర్తించి వారికి మరింత ప్రోత్సాహం అందించే బాధ్యత మనందరిపై ఉంది. భవిష్యత్తులో లక్ష్యాలు చేరుకునేలా సహాయ సహకారాన్ని అందించాలి. దేశాన్ని ముందుకు నడిపించే బాధ్యత యువతదే. రాష్ట్రాన్ని



అవార్డులు అందుకున్న విద్యార్థులతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాస్ తదితరులు

అభివృద్ధి చేయాలంటే విద్యతోనే సాధ్యమని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గుర్తించి ఇటువంటి కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ సహాయ సహకారాలతో విద్యార్థులంతా మంచి భవిష్యత్తు పొందాల'ని స్పష్టం చేశారు.

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 'పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' అవార్డులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. విద్యార్థుల్లో ఉత్సాహం పెంపొందించేలా ఈ కార్యక్రమం జరుగుతోంది. విద్యార్థులకు మెరుగైన విద్యను ప్రభుత్వం అందిస్తోంది. చాలెంజ్డ్ విద్యార్థులకు విద్యనందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. భవిష్యత్ కార్యాచరణ దృష్టిలో ఉంచుకుని విజన్ 2047 ప్రణాళికలు రూపొందించాం. బాగా చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకే కాకుండా సొంత గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాల'ని కోరారు. గెలుపు దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి.. ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.
- అనంతరం షైనింగ్ స్టార్స్‌కు ఎంపికైన కొండములగాం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని ఝాన్సీ, లావేరు మండలం మురపాక జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థి రోహన్, ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల (మిగతా 6వ పేజీలో..)

ప్రారంభమైన ఏపీ పీజీ సెట్

ఎచ్చెర్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పీజీ కోర్సుల్లో ప్రవేశానికిగానూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు, వాటి అనుబంధ కళాశాల్లో పీజీ సీట్ల భర్తీకి ఈ నెల 11 వరకు మూడు షిఫ్ట్‌ల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. తొలిరోజు సోమవారం శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో మూడు షిఫ్ట్‌ల్లో కలిపి 220మంది విద్యార్థులకు 181మంది హాజరయ్యారు. 39 మంది గైర్హాజరయ్యారు.

నేడు గ్రామదేవతల సిరిమానోత్సవం

- పెద్దమ్మవారు, నూకాలమ్మకు ప్రత్యేక పూజలు
- రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

6లో

కొట్టేద్దాం.. కట్టేద్దాం

- బరితెగించిన కబ్జాదారులు
- డీ పట్టా భూముల్లో అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

నెమలీ.. నెమలీ.. ఎక్కడికెళ్లావ్?

- ప్రస్తుతం తోటల్లో స్వల్పంగానే మయూరాల సంచారం

6లో



యోగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

జీవనశైలిలో యోగా భాగం కావాలి

- ప్రధాని సభకు జిల్లా నుంచి 80వేల మంది
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో

గాలీవాన బీభత్సం

- కూలిన మర్రిచెట్టు.. విరిగిన స్తంభాలు
- 20 గ్రామాలకు నిలిచిన విద్యుత్

హరిపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో గాలీవాన బీభత్సం సృష్టించాయి. సోమవారం ఉదయం ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం 4గంటల సమయంలో వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు మందస మండలం పొత్తంగి- సిరిపురం వద్ద భారీ మర్రివృక్షం కూలింది. చెట్టు కొమ్మలు కరెంటు తీగలపై పడటం తో నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైంది. దీంతో బెల్లుపటియా, సిరిపురం, పొత్తంగి, భోగాపురం పంచాయతీల పరిధిలో సుమా రు 20 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ ఎల్.యోగి తన సిబ్బందితో కలసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపడుతున్నారు.



పొత్తంగి వద్ద కూలిన మర్రిచెట్టు



సిరిపురం వద్ద ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

పలాసలో ప్రయాణం.. పద్మవ్యూహమే

- వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య
- రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



పలాస, జూన్ 9(ఆంధ్రజ్యోతి):

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవు తోంది. పేరుకు 80 అడుగుల రహదారి. కానీ రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిపేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్‌రోడ్, కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్, శ్రీనివాసలాడ్జి జంక్షన్, ఇందిరాచౌక్, ఎస్‌బీఐ జంక్షన్ వద్దపరిస్థితి దారుణంగా ఉంది. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించాలంటే.. పద్మవ్యూహాన్ని ఛేదించినట్టేనని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- గాంధీనగర్‌లో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేసేస్తున్నారు. వాస్తవానికి ఇది 40 అడుగుల వెడల్పుతో కాశీబుగ్గలో ఉన్న ఏకైక రహదారి. ఇటీవల ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేశారు. ఈ మార్గంలో ఆసుపత్రులు, బ్యాంకులు, భారీ మాల్స్ పాఠశాలలు ఉన్నాయి. కాగా నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా (మిగతా 6వ పేజీలో..)

- **కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ దుస్థితి ఇదీ.** ఇతర గ్రామాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన దారి కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. కొంతమంది భారీ వాహనాలు తీసుకువచ్చి రోడ్డుపైనే పార్కింగ్ చేసి సరకులు అన్‌లోడ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే స్థానిక హోటల్స్ వద్ద పార్కింగ్‌కు అవకాశం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో నిత్యం ప్రజలు గంటలకొద్దీ ట్రాఫిక్‌లో ఇరుక్కొంటూ నరకాన్ని చూస్తున్నారు.

- **పలాస-కాశీబుగ్గలో రైల్వేస్టేషన్ రోడ్డు** పేరు చెబితేనే వాహనదారులు హడలిపోతున్నారు. ముఖ్యమైన రైళ్లు వచ్చే వేళలు ఉద యం 8 గంటల లోపు, మధ్యాహ్నం 11 నుంచి 1 గంట, సాయంత్రం 4 నుంచి 7గంటల వరకూ వాహనాలు రోడ్డుపైనే బారులుదీరుతున్నాయి. స్టేషన్ నుంచి వచ్చే ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు రోడ్డుపైకి రాగానే కేటీ రోడ్డు జంక్షన్ వద్ద కనీసం అరగంట సమయ మైనా ఆగాల్సిన పరిస్థితి ఉంది. రోడ్డుపై వాహనాలు పెడుతుండ డంతో స్టేషన్ నుంచి బయటకు వెళ్లాల్సిన వాహనాలకు దారి లేకుండా పోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నెమలీ.. నెమలీ.. ఎక్కడికెళ్లావ్?



- ఇటీవల సందడి చేసిన మయూరాలు
- ఎక్కువ సంఖ్యలో కనిపించిన వైనం
- ప్రస్తుతం తోటల్లో స్వల్పంగానే సంచారం

వజ్రపుకొత్తూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నెమలి... ఈ పేరు చెబితే అందమైన పురి విప్పి... నాట్యం చేసే అద్భుతమైన మూగప్రాణి గుర్తుకు వస్తుంది. కానీ రాను రానూ మయూరాల ఉనికి కష్టమవుతోంది. సంఖ్య తగ్గుతోంది. అడవులు... తరిగిపోతుండడంతో వాటిపై ఆధారపడే మూగప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. అవి చెట్టుకొకటి... పుట్టకొకటిగా చెదిరిపోతున్నాయి. ఈ మూగజీవుల్లో ఒకటైన నెమలి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అసలే అంతంతమాత్రంగా ఉన్న నెమళ్ల సంఖ్య ఇటీవల కాలంలో మరింత తగ్గుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో నెమళ్ల సంఖ్య భారీగా పడిపోయింది. తీరప్రాంతంలోని తోటల్లో ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో మయూరాలు సందడి చేశాయి. ఇక్కడి తోటల్లోని చెట్లపై తిరుగుతూ కనువిందు చేశాయి. వీటిని చూసి రైతులు కూడా సంతోషంతో ఉప్పొంగిపోయారు. ఈ ప్రాంతంలో సుమారు 18 నెమళ్ల గుంపు తిరుగుతుండడం తాము చూశామని... ప్రస్తుతం వాటిలో సగం మాత్రమే కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా బాతుపురం నుంచి చినవంక సముద్ర తీరంలో వీటి సంచారం అధికంగా ఉండేది. నెమళ్ల సంఖ్య సంఖ్య తగ్గుతుండడంతో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకృతిని ప్రేమించే ఈ ప్రాంతీయులు నెమళ్ల సంఖ్య తగ్గుతుండడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెమళ్లు ఈ ప్రాంతానికి వచ్చిన తరువాత పాముల బెడద తగ్గిందంటున్నారు. వీటిని కాపాడడానికి ప్రయత్నించాలని అధికారులను కోరుతున్నారు.

ఆడ నెమళ్లు బయట తిరగవు..

ఇటీవల గస్తీలో భాగంగా తిరుగుతున్నప్పుడు తీరంలో 8 నెమళ్లను చూశాం. ఉద్దానం ప్రాంతంలో మొత్తం 25 నెమళ్లు ఉన్నట్టు అంచనా. గుడ్లు పెట్టే సమయం కావడంతో ఆడ నెమళ్లు జనసంచారం లేని సురక్షిత ప్రాంతాలలో తిరుగుతూ గుడ్లు పొదుగుతుంటాయి. ప్రస్తుతం తోటల్లో తిరుగుతున్నవి మగ నెమళ్లు కావచ్చు. వీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. -పోలయ్య, అటవీశాఖాధికారి



డీ-పట్టా భూములలోని అక్రమ నిర్మాణాలు

కొట్టేద్దాం... కట్టేద్దాం

- బరితెగించిన కబ్జాదారులు
- డీ పట్టా భూముల్లో అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

కొత్తూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వంశధార రిజర్వాయర్ పుణ్యమా అని మండలంలో భూముల విలువ అమాంతంగా పెరిగింది. దీంతో ప్రభుత్వ స్థలాలు, డీపట్టా భూములపై ఆక్రమణదారుల కళ్లు పడ్డాయి. దీంతో ఎక్కడికక్కడే ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడుతున్నారు. ఏకంగా భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మెట్టూరు పంచాయతీ నేరడి రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబరు 114లో సుమారు 2.39 ఎకరాల ప్రభుత్వ గయ్యాలి భూమి ఉంది. ఇరవై ఏళ్ల క్రితం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు చెందిన అలికాన సంజీవరావుకు 0.91 సెంట్లు, సవర మొకలింగానికి 0.31 సెంట్లు, సవర చిన్నారావుకు 0.31 సెంట్లు, అలికాన దేవదాసుకు 0.46 సెంట్లు, బాడాన కరువుకు 0.46 సెంట్లు డీ పట్టాలుగా ఇచ్చింది. ప్రస్తుతం వీరెవరూ జీవించి లేరు. దీంతో మరికొందరి అనుభవంలో ఈ భూములు ఉన్నాయి. ఇదే స్థలాన్ని గత ప్రభుత్వం ఆసుపత్రికి కేటాయించేందుకు ప్రయత్నించింది. ఇది ఎస్సీ, ఎస్టీలకు చెందిన కుటుంబాలకు ఇచ్చినట్టు గుర్తించిన అధికారులు, అప్పటి నాయకులు తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. మెట్టూరులో ఆసుపత్రి నిర్మాణానికి మరోచోట స్థలాన్ని కేటాయించారు. ఇదే అదునుగా ఖాళీగా ఉన్న ఉన్న డి-పట్టా భూములపై కొంతమంది కన్నుపడింది. ఈ స్థలానికి ఎదురుగా పెట్రోల్ బంకు ఉండటంతో పరిసర భూములకు ధరలు పెరిగాయి. అలికాం-బత్తిలి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న అత్యంత విలువైన ఈ భూమిలో మెట్టూరుకు చెందిన ఓ వ్యక్తి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఇదే అదునుగా మెట్టూరు, ఇరపాడు తదితర గ్రామాలకు చెందిన మరో తొమ్మిది మంది అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై స్థానిక సర్పంచ్ ఆది నుంచీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా... అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీల నాయకులు కొత్తూరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల నుంచి స్పందన లేదు. దీంతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

పట్టాల రద్దుకు సిఫారసు చేస్తా..



ఆక్రమణల విషయమై తహసీల్దారు కె.బాలకృష్ణను వివరణ కోరగా... ప్రభుత్వ భూమిలో కొంతమందికి డి-పట్టాలు ఇవ్వడం వాస్తవమేనని చెప్పారు. ఆక్రమణదారులు భవన నిర్మాణాలు చేపడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. డి పట్టా భూములను రద్దు చేయాలని ఆర్డీవోకు సిఫారసు చేస్తామని చెప్పారు.

మాకివలసలో ఘనంగా జగన్నాథుని ఉత్సవం

జలుమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మాకివలస గ్రామంలో వెలసిన జగన్నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఘనంగా పానీహాట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనికేతన్ కృష్ణదాసు ఆధ్వర్యంలో ఉదయం సుభద్ర, బలభద్ర సహిత జగన్నాథ స్వామి ఉత్సవమూర్తులకు పూలమాలలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి.. పల్లకిలో ఆశీనులను చేశారు. హరేరామ హరేకృష్ణ నామస్మరణతో గ్రామోత్సవం నిర్వహించి వంశధార నదికి తీసుకెళ్లారు. నది ఒడ్డున ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులకు పుణ్యస్నానాలు ఆచరింపజేశారు. మాకివలస, గంగన్నపేట, ఉడకలపేట గ్రామాలకు చెందిన భక్తులు అదే సమయంలో నదిలో స్నానాలు ఆచరించి పునీతులయ్యారు. ఈ సందర్భంగా ఇస్కాన్ భక్తబృందం సభ్యులు మాట్లాడుతూ 503 ఏళ్ల క్రితం శ్రీకృష్ణ చైతన్యమహాప్రభువు నిత్యానంద మహాప్రభువు శిష్యుడైన రఘునాథ స్వామి ద్వారా పానీ హాట్ ఉత్సవం మాకివలసలో ప్రారంభించినట్టు తెలిపారు. అప్పటి నుంచి జేష్ఠ మాస త్రయోదశి పర్వదినానఏటా సంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన పలువురు భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



జగన్నాథ స్వామి ఉత్సవమూర్తులను వంశధార నది నుంచి తీసుకువస్తున్న భక్తులు



భాగవత పారాయణం చేస్తున్న పండితులు

శ్రీముఖలింగంలో పండిత సదస్యం..

శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి పండిత సదస్యం నిర్వహించారు. స్వామివారి పాంచరాత్ర కల్యాణ మహోత్సవాల్లో భాగంగా దేవదాయ సిబ్బంది, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు పండిత సదస్యం నిర్వహించి రామాయణ, భాగవత, మహాభారతం గురించి వివరించారు. శ్రీముఖలింగేశ్వరస్వామి పురాణగాథ, విశిష్టతను వివరించి స్వామివారి గొప్పతనాన్ని విశదపరిచారు. వేద పండితులను, అర్చకులను దుశ్శాలువలతో సన్మానించారు. ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, గ్రామ పురోహితులు బంకుపల్లి భూషణ శర్మ, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, సింహాచలం, శివ, శ్రీకృష్ణ, అప్పారావు, అచ్యుత, యోగి, భక్తులు పాల్గొన్నారు.

నేడు గ్రామదేవతల సిరిమానోత్సవం

- పెద్దమ్మవారు, నూకాలమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవతల సిరిమానోత్సవాల సందర్భంగా పాత శ్రీకాకుళంలో సోమవారం పెద్దమ్మవారు, నూకాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ముర్రాటలు సమర్పించారు. అమ్మవార్లకు నూతన వస్త్రాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఇళ్ల నుంచి ఘటాలను అమ్మవారి దగ్గరికి తీసుకువెళ్లి.. దీపాలు వెలిగించారు. వివిధ రకాల వంటలను నైవేద్యంగా పెట్టారు. మంగళవారం రెండుచోట్ల సిరిమానోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు డి.పి.దేవ్, రామలింగం, ఎల్. నందికేశ్వరరావు, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు తెలిపారు. సిరిమానోత్సవాల కోసం ప్రత్యేక రథాలను సిద్ధం చేశారు. సాయంత్రం 3 గంటల నుంచి సిరిమానోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు.



నూకాలమ్మ తల్లి

నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు..

శ్రీకాకుళం క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళంలో జరుగుతున్న పెద్దమ్మతల్లి, నూకాలమ్మ తల్లి సిరిమాను ఉత్సవం నేపథ్యంలో జూన్ 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్టు ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అటు వైపు అనుమతి లేదు...

- పొట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి జిల్లా పరిషత్, సంతోషిమాత గుడి, కలెక్టర్ బంగ్లా మీదుగా కునుకుపేటకు వెళ్లడానికి ఎటువంటి వాహనాలనూ అనుమతించరు.
- నగరంలోని 80 అడుగుల రహదారి, వాంబే కాలనీ మీదుగా కునుకుపేటకు వెళ్లడానికి కూడా వాహనాలకు అనుమతి లేదు.
- కునుకుపేట నుంచి కలెక్టర్ బంగ్లా, సంతోషిమాత గుడి, జిల్లా పరిషత్ మీదుగా పొట్టి శ్రీరాములు జంక్షన్‌కు చేరడానికి వాహనాలకు అనుమతి లేదు.
- కునుకుపేట నుంచి వాంబే కాలనీ మీదుగా 80 అడుగుల రహదారిలో వెళ్లడానికి వాహనాలకు అనుమతి లేదు.
- శ్రీకాకుళం పట్టణం నుంచి 80 అడుగుల రహదారి కూడలి, అరసవల్లి, ఖాజీపేట మీదుగా కునుకుపేటకు చేరుకోవాలి.
- పొట్టి శ్రీరాములు జంక్షన్, పోలీసు పెట్రోల్ బంకు వెనుక భాగంలోని ఖాళీ స్థలం, 80 అడుగుల రహదారిలోని ఎంపీ నివాసం పక్కన ఉన్న ఖాళీ స్థలం, ఎగ్జిబిషన్ పక్కన ఉన్న వాకింగ్ మైదానంలో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలి.

ప్రజలు, భక్తులకు ముఖ్య సూచనలు...

సిరిమాను ఉత్సవం పూర్తయ్యే వరకు మద్యం తాగి వాహనాలు నడపరాదు. మద్యం తాగి.. సిరిమాను, బ్యాండ్, సంప్రదాయ వాయిద్య బృందాల వద్దకు వెళ్లకూడదు. సాంస్కృతిక కార్యక్రమాల వద్ద ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా ప్రవర్తించరాదు. సాంస్కృతిక కార్యక్రమాల్లో డ్యాన్సులు, పాటలు అశ్లీలంగా ఉండకూడదు. ఒక వేళ జరిగితే కమిటీ సభ్యులను బాధ్యులను చేస్తూ చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

జీవనశైలిలో యోగా భాగం కావాలి

- ప్రధాని సభకు జిల్లా నుంచి 80వేల మంది
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మన జీవన శైలిలో యోగా భాగం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా మాస్ యోగా ర్యాలీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఈ ర్యాలీలు జరిగాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు జరిగిన యోగా ర్యాలీలో ఆయన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఏడురోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21న ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి 80 వేల మంది ఔత్సాహిక యోగ సాధకులు హాజరవుతున్నారని చెప్పారు. యోగాను జీవనశైలిలో ఒక భాగంగా చేసుకోవాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ఈ ర్యాలీల ఉద్దేశమని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓ సాయి ప్రత్యూష, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ జగదీష్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, వివిధ సచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా కేంద్రాల సభ్యులు, నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

చట్ట పరిధిలో ఫిర్యాదులు పరిష్కరించండి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమ వారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో 57 మంది నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసు కున్నారు. అనంతరం ఆయా స్టేషన్ల ఇన్‌చార్జిలతో జూమ్‌లో మాట్లాడి ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. కుటుంబ సమస్యలు, మోసపూరితమైన, ఆస్తి తగాదాలు, సివిల్ ఇతరత్రా అంశాలపై ఎస్పీకి ఫిర్యాదులు అందాయి.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి





గాంధీనగర్‌లో వాహనాల పార్కింగ్ ఇలా

పలాసలో ప్రయాణం.. పద్మవ్యూహమే

(ఐదో పేజీ తరువాయి)

వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మళ్లీ ఇబ్బందులు తప్పడం లేదు.

- పలాసలోని ఎస్‌బీఐ రోడ్డులోనూ ఇదే దుస్థితి. అసలే ఇరుకైన రహదారి, దీనికి తోడు మొత్తం నాలుగు బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు, మీ సేవా కేంద్రాలు ఇక్కడే ఉన్నాయి. 20 అడుగుల వెడల్పు ఉండే ఈ రోడ్డుపైనే పార్కింగ్ చేస్తు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో నిత్యం ప్రజలు ఇక్కడ పార్కింగ్ కష్టాలు చూడాల్సి వస్తోంది.
- కేటీ రోడ్డులో ఎక్కడ చూసినా వాహనాలు పార్కింగ్ చేసి దర్శనమిస్తూనే ఉంటాయి. రోడ్డుకు ఇరువైపులా పది అడుగుల మేర పార్కింగ్ చేస్తున్నారు. ఉన్న 60 అడుగుల స్థలం కూడా అవసరం కొద్దీ రోడ్డుపైనే వాహనాలు బారులుతీరుతాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ తీవ్ర ట్రాఫిక్ ఉంటోంది. అటువంటి సమయంలో వాహనాలు రోడ్డుపైనే ఉండడంతో ప్రజలు, బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. శ్రీనివాసలాడ్జి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ఇదే పరిస్థితి ఉంది. పోలీసులు దీనిపై దృష్టి సారించి.. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థి దామోదర స్వప్న, పొందూరు హైస్కూల్ విద్యార్థిని ఫాతిమా తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులందరికీ ఎంతగానో ప్రేరణ కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, డీఈవో తిరుమల చైతన్య, ఆర్ఐఓ దుర్గారావు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నార్కోటిక్ డాగ్‌తో షాపింగ్ మాల్స్ తనిఖీ

ఇచ్ఛాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టే క్రమంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. పట్టణంలో గల షాపింగ్‌మాల్స్ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్, రైల్వేస్టేషన్‌లలో నార్కోటిక్ డాగ్ కెనైన్ సాయంతో సోమవారం తనిఖీలు చేపట్టినట్టు సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల వద్ద ఉన్న మూటలను జాగిలం సాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నార్కోటిక్ డాగ్ గంజాయి వంటి మాదక ద్రవ్యాలను సులభంగా కనిపెట్టగలదని సీఐ తెలిపారు. అందుకే వీటి సాయంతో తనిఖీలు చేపడుతున్నట్టు వెల్లడించారు.



షాపింగ్‌మాల్‌లో డాగ్ సాయంతో తనిఖీలు చేపడుతున్న సీఐ

రేపు జాతీయస్థాయి కబడ్డీ జట్టు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనున్న జట్టును ఈ నెల 11న తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జేఎన్‌టీయూలో ఎంపికలు నిర్వహించనున్నట్టు అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు మునలినాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారు ఈ నెల 28వ తేదీ నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలో హరిద్వార్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికల్లో పాల్గొనే వారు 2007 జూన్ 28వ తేదీ తర్వాత పుట్టిన వారు అర్హులని, వారికి 18 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఇతర వివరాలకు ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు ఫోన్ నెంబరు 9441914214లో సంప్రదించాలని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోండి

కవిటి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కవిటి సినిమా థియేటర్ రోడ్డులో ఉన్న వెల్డింగ్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆ వీధివాసులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం మండల గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. వెల్డింగ్ షాపు వల్ల తామంతా ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ షాపు నిర్వహణకు పంచాయతీ అనుమతులు లేవని, విద్యుత్‌లైన్ నిర్వహణ అక్రమంగా ఉందని పిర్యాదులో వివరించారు. ఈ మేరకు అధికారులు స్పందించి షాపును పరిశీలించి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని బి.సత్యానంద్, బి.టిప్రసాద్, వెంకటరావు, శ్రీను, హేమలత తదితరులు తహసీల్దార్ బి.మురళీమోహన్, ఎంపీడీవో విశ్వేశ్వరరావులను కోరి వినతి పత్రాలు అందించారు.

రైతులకు అండగా ప్రభుత్వం


రైతులకు విత్తనాలు అందిస్తున్న విప్ బెందాళం అశోక్

కవిటి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. బెజ్జిపుట్టుగలో సోమవారం ఖరీఫ్ రైతులకు విత్తనాలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ చర్యల వల్ల రాష్ట్రం వెనుకబడిందన్నారు. రైతులకు మేలుచేస్తున్నామని చెప్పి వారి నుంచి సరుకులు కొనుగోలు చేసి నెలల తరబడి సొమ్ములు అందించని దుస్థితికి గతపాలకులు తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు నుంచి కొనుగోలు చేసిన 24 గంటల్లోనే సొమ్ము చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజనుకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచి రైతులకు మేలు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.మణిచంద్రప్రకాష్, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు, ఎస్‌వీ రమణ, బి.రమేష్, బి.తిరుమలరావు, వ్యవసాయాధికార్లు బి.నరసింహామూర్తి,పి.శ్రీదేవిలున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ఆమదాలవలస, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెట్టక్కివలస, పాత్రునివానిపేటలో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శ్రీసత్య సాయి సమితి ప్రతినిధులు సోమవారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిం చారు. సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధాను ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాదళ్ ప్రతినిధులు కె.ప్రహ్లాదరావు, కె.మల్లేశ్వరరావు, జి.మల్లేశ్వరరావు, ఎస్‌వీ రమణ, కె.యోగేశ్వర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ జిల్లా టాపర్‌కు సత్కారం


స్థితప్రజ్ఞను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

పాత శ్రీకాకుళం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచి.. రాష్ట్ర స్థాయిలో 180వ ర్యాంకు సాధించిన చాపల స్థితప్రజ్ఞను సింగుపురం ప్రాంతానికి చెందిన ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి భయ్యా శ్రీహరి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

వేశ్యల రాజధాని అనడం దారుణం


మాట్లాడుతున్న కొల్ల జయరాం

బూర్జ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేవతలు నడయాడిన వేద భూమి అమరావతిని జర్నలిస్టులు ముసుగులో ఉన్న వైసీపీ కార్యకర్తలు వేశ్యల రాజధాని అనడం దారుణమని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం అన్నారు. ఆయన పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అనేక త్యాగాలు చేసి రాజధాని అమరావతికి భూమిలిచ్చిన మహిళా రైతులను సైతం కించపరుస్తూ మాట్లాడడం సరికాదన్నారు. తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ నాయకులు దాలినాయుడు, జనసైనికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

ఆమదాలవలస, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేద్దామని యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు, రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, హెచ్‌ఎం కేవీ రాములు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలనాటారు. పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

● జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

ఎచ్చెర్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో శారీరక, మానసిక ప్రశాంతత పొందవచ్చునని ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఈ మేరకు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సోమవారం యోగాసనాలు వేసి, అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్య జీవన విధానంలో యోగా భాగం కావాలన్నారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ జి.రవి, యోగా విభాగాధిపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా యోగాపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు పాల్గొని యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.



నరసన్నపేట: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు


ఎచ్చెర్ల: యోగాసనాలు వేస్తున్న ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ బాలాజీ, తదితరులు



ఆమదాలవలస: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



గార: యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది



పలాస: ఇందిరాచౌక్ వద్ద ర్యాలీగా కమిషనర్ రామారావు, తదితరులు



ఇచ్ఛాపురం: ర్యాలీలో పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ రమేష్, సిబ్బంది


పాతపట్నం: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించండి

● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కారంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చినవారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● తమ ఇంటి స్థలాన్ని గ్రామానికి చెందిన పెత్తందారు ఆక్రమించి బెదిరిస్తున్నాడని జలుమూరు మండలం టిక్కలపాడు గ్రామానికి చెందిన దివ్వలస వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి తన సమస్యను వివరించి వినతిపత్రం అందజేశాడు. తన ఇంటి స్థలాన్ని గ్రామ అగ్రకుల పెత్తందారురు ఆక్రమించుకున్నారని, ఖాళీ చేయమంటే బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోయిందని, గత ఆరు నెలలుగా సమస్యను పరిష్కరించడం లేదన్నాడు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

● సోంపేట మండలం గొల్లఊరు పంచాయతీకి చెందిన కవిరాజు గ్రీవెన్స్‌లో జేసీని కలిసి వినతి పత్రం అందజేశారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన డొక్కా సీతమ్మ ఈ ఏడది ఏప్రిల్‌లో మరణించిందని, ఆమెకు భర్త, పిల్లలు లేరు. దీంతో ఆమె సోదరుడు మడ్డు ఉమాపతి మామిడిపల్లి సచివాలయంలో మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశాడని, కానీ ఇంతవరకు సచివాలయ కార్యదర్శి సరైన కారణం తెలుపకుండా పత్రం మంజూరు చేయలేదని, దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలని జేసీని వేడుకున్నారు.

జిల్లా అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం విజయవాడ సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన కలెక్టరేట్ నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో జిల్లా కీలకపాత్ర పోషించనుందన్నారు. జిల్లాలో గల సముద్ర తీరం, రవాణా వనరులు, వ్యవసాయ శక్తిని పూర్తిగా వినియోగించుకుంటూ, జిల్లా తలసరి ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపడతామన్నారు. ముఖ్యమంత్రి సునిసిత దృష్టితో రాష్ట్రంలో పీ-4 విధానాన్ని తీసుకువచ్చారన్నారు. ముఖ్యమంత్రి నుంచి ప్రేరణ పొంది, నేను కూడా 10 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నాను. మూలపేట పోర్టు, పలాస ఎయిర్ పోర్టు, ఇచ్ఛాపురం పరిధిలో జీడి, కొబ్బరి, పనస ఆధారిత పరిశ్రమల స్థాపన, రవాణా మార్గాల అభివృద్ధి వంటి చర్యలు జరుగనున్నాయి. వలస వెళ్లిన జిల్లా వాసులు తమ ఊరిని, జిల్లాను అభివృద్ధి చేయడంలో భాగస్వాములవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో సాయిప్రత్యూష, సీపీవో లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

సంపద సృష్టించుకోవాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఇచ్ఛాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించుకొని పేదరిక నిర్మూనకు అంతా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. సోమవారం రాజధాని అమరావతి నుంచి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శశిభూషణ్, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో రామారావు పాల్గొన్నారు. సంపద సృష్టించుకోవడం ఎలా, పేదరికం నిర్మూలన, నియోజకవర్గంలో ఉన్న వనరులును ఎలా ఉపయోగించుకోవాలో సీఎం అధికారులకు అవగాహన కల్పించారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల తొలగింపు సరికాదు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నేతలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి నోటీసులు లేకుండా విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న 3,500 మంది కార్మికులను తొలగించడం అన్యాయమని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అఖిల పక్ష కార్మిక సంఘాలు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి 5,400 మంది ఉద్యోగులను తొలగించేందుకు ప్రణాళికలు వేస్తున్నారని విమర్శించారు. నాయకులు గోవర్ధనరావు, తూతిక ప్రవీణ, ఎ.సత్యనారాయణ, ఎల్.రామప్పడు, పి.సుధాకర్‌బాబు, పి.జగ్గారావు, పి.జనార్దనరావు, కేవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

కవిటి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ కపాసుకుద్ది గ్రామంలో సోమవారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి గ్రామవీధుల్లో ఊరేగింపు చేపట్టారు.


కపాసుకుద్దిలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

జీజీహెచ్ నుంచి కొవిడ్ బాధితుడు డిశ్చార్జి

శ్రీకాకుళం రిమ్స్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి కొవిడ్ కేసు నమోదైన విషయం పాఠకులకు విదితమే. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లోని ప్రత్యేక వార్డులో కొవిడ్ బాధుడికి వైద్యులు చికిత్స అందించారు. దీంతో బాధితుడు కోలుకోవడంతో స్కానింగ్, ఇతర పరీక్షలు నిర్వహించిన అనంతరం సోమవారం డిశ్చార్జి చేశారు. ఇంటివద్దనే ఐసోలేషన్‌లో ఉంచాలని వైద్యులు సూచించారు. ఈ ఒక్క కేసు తప్ప మరే కేసులు నమోదు కాలేదు. అలాగే కొవిడ్ బాధితుడికి సంబంధించిన వారి నుంచి నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించారు. వాటి రిపోర్టులు మంగళవారం సాయంత్రానికి రానున్నాయి.

డీఎస్సీకి 251 మంది హాజరు

ఎచ్చెర్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతుంది. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో ఉదయం షిఫ్ట్‌లో 126కు 121 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 144కు 130 మంది హాజరుకాగా, 19 మంది గైర్హాజరయ్యారు. రెండు షిఫ్ట్‌ల్లో కలిపి 251 మంది హాజరయ్యారు.

మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్

కంచిలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామని ప్రిన్సిపాల్ శివప్రసాద్ ప్రకటనలో తెలిపారు. కంచిలి మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతులతోపాటు ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మిగిలిన ఉన్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 10నుంచి జూన్ 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకుని, ఆ సెట్ ప్రింట్‌ను స్కూల్‌లో అందించాలన్నారు.

టీడీపీ మండల కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా లోపింటి పద్మనాభం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోగల గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు అధ్యక్షతన మండల పార్టీ కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా పెదిని దుర్యోధనరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దక్కత కామేశ్వరరావు, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా కరగాన కృష్ణ, క్షేత్రవాసి బెహరా, దున్న కూర్మారావు, కార్యదర్శులుగా ఆశి రామకృష్ణారెడ్డి, మేరుగు నారాయణరెడ్డి, ఉగ్రపల్లి సత్యనారాయణ, కోశాధికారిగా ఆశి మాధవరావురెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బదకల గణపతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి పార్టీనాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళంలో టీపీఎం హైస్కూల్‌లో 1999-2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు ఉపాధ్యాయులను మంగళవా యిద్యాల నడుమ ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురువులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, భువనేశ్వరి, సాంబమూర్తి, పూర్వ విద్యార్థులు గోవింద్, లక్ష్మణ, నవీన్, స్వాతి, సురేష్, బోనెల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడేయడం అన్యాయం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లను తొలగించి 18,500 కుటుంబాలను రోడ్డున పడేయడం అన్యాయమని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఏఐటీయూసీతో కలిసి సోమవారం స్థానిక జడ్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లకు 2027 జనవరి వరకు అగ్రిమెంట్ ఉందని, కానీ మధ్యలోనే తమను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. మేం ఎవరికీ లంచాలు ఇవ్వలేం. అందుకే అన్యాయంగా మమ్మల్ని రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గ్రీవెన్స్‌లో జీసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

చీడివలసలో 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్'

బూర్జ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చీడివలస గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త శైలజ, అనూష్ వరి రకాలు, అపరాల రకాలపై రైతులకు వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయ అధికారి బొబ్బిలి శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై ర్యాలీ

బూర్జ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పెద్దపేట పంచాయతీలో ఉపాధి హామీ సామాజిక తనిఖీలపై సోమవారం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం



మోటారు బిగించని బోరు

మండలంలోని శివారు గ్రామమైన వాసుదేవపురంలో తాగు నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఏడాది నీటి ఎద్దడి నివారణకు బోరు వేశారు. ఇప్పటి వరకు మోటారు బిగించక పోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. బావి నీటిని వినియోగించేవారమని, అయితే గడచిన కొన్నేళ్లుగా క్లోరినేషన్ చేయకపోవడంతో నీరు కలుషి తమై వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోయారు. దీనిపై గ్రామీణ రక్షిత మంచి నీటి పథకం (ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈ చంద్రమౌళిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి మోటారు బిగించి తాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు.

-జలుమూరు, ఆంధ్రజ్యోతి

ఆవేదన

ప్రస్తుతం వర్షాలు పడడంతో ఖరీఫ్ సాగుకు రైతు సమాయత్తమవుతున్నాడు. అయితే సాగునీరందించే కాలువలు అధ్వానంగా ఉండడంతో ఆవేదనకు గురవుతున్నారు. సాగునీటి కాలువ రూపాలే కానరావడం లేదు. మండలంలోని 19ఆర్, 20ఆర్, పోలాకి హెడ్ చానల్, నగిరికటకం చానల్ గుర్రపు డెక్కతో పూడుకుపోయి సాగునీరందే మార్గం కనిపించడం లేదు. కాలువల్లో ఎటువంటి పనులు చేపట్టక పోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి పూడుకుపోయాయి.

- జలుమూరు, ఆంధ్రజ్యోతి



పాగోడు కూడలి వద్ద పూడుకుపోయిన కూర్మనాథపురం 20ఆర్ కాలువ

ఇబ్బందులు



దేవాంగుల వీధిలో పాడైన సీసీ రోడ్డు

పాతపట్నం దేవాంగుల వీధిలో సీసీ రోడ్డు దారుణంగా తయారైంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుకు సీసీ రోడ్లు తవ్వి ఆ తరువాత అలాగే వదిలేశారు. ఎటువంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని వారు కోరుతున్నారు.

-పాతపట్నం, ఆంధ్రజ్యోతి

అమ్మవారి సంబరాల్లో పాల్గొని..

- తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- ఇచ్ఛాపురానికి చెందిన యువకుడి మృతి



నాగరాజు (ఫైల్)

కవిటి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జమేదారుపుట్టుగ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం పట్టణంలోని ఉప్పల వీధికి చెందిన చెందిన గేదెల నాగరాజు(32) బంధువుల పిలుపుమేరకు ఆదివారం కంచిలిలో జరుగుతున్న కంచమ్మతల్లి సంబరాల్లో పాల్గొన్నాడు. సాయంత్రం వరకు ఉత్సవాలను తిలకించిన తర్వాత తన ఇంటికి చేరుకునేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో జమేదారుపుట్టుగ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సోమవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. కాగా నాగరాజుకి భార్య దివ్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భవతి. ఇదిలావుంటే గతంలో నాగరాజు తల్లిదండ్రులతోపాటు సోదరుడు కూడా అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

25 మద్యం సీసాలు పట్టివేత

ఆమదాలవలస, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ఆమదాలవలస గేటు వద్ద సోమవారం ఉదయం 25 మద్యం సీసాలతో ఒక వ్యక్తి పట్టుబడినట్టు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఏడో వార్డు చింతాడ గ్రామానికి చెందిన గుండ సురేష్ మద్యం సీసాలు ఒక సంచిలో పట్టుకొని అక్కడ ఉన్నట్టు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా.. 25 మద్యం సీసాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో సురేష్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జలుమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) ఎటువంటి అనుమతి పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. తిలారు ఆర్ఎస్, యాళ్లపేటల్లో సోమవారం వేకువజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అనుమానితుల వివరాలు సేకరించారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించినపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో జలుమూరు, సారవకోట, పోలాకి ఎస్ఐలు బి.అశోక్‌బాబు, అనిల్‌కుమార్, రంజిత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గేదెల స్వాధీనం

- ఆరు మృత్యువాత

నరసన్నపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అలమండ సంతకు ఒక వ్యాన్‌లో తరలిస్తున్న 16 గేదెలను మడపాం టోల్‌ప్లాజా వద్ద నరసన్నపేట పోలీసులు పట్టుకున్నారు. సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా పరిశీలిస్తున్న సమయంలో వ్యాన్‌లో 16 గేదెలను తరలిస్తుండగా వాటిలో ఆరు మృతి చెందినట్లు గుర్తించారు. చిన్నవాహనంలో 16 గేదెలను ఎక్కించడంతో పాటు గాలి ఆడకుండా వ్యాన్ చుట్టూ టర్పాలిన్లు కట్టడంతో అవి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ నేత దాడి చేశారని ఫిర్యాదు

వజ్రపుకొత్తూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పెదవంక గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బత్తిన లక్ష్మీనారాయణ తనపై ఈనెల 5న దాడి చేసి గాయపరిచినట్లు గ్రామానికి చెందిన పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు బత్తిన మహేష్ టీడీపీ నేతలతో కలిసి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 5వ తేదీన రోడ్డుపై వేసిన చెత్తకుప్పలపై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఈ దాడి జరిగినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడి మహేష్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ ఘటనలో తన బుల్లెట్ పాడైందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు.

ఖరీఫ్‌కు సమాయత్తం కావాలి

నరసన్నపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్‌కు రైతులు సమయత్తం కావాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త బి.స్వాతి సూచించారు. సోమవారం కోమర్తి గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఖరీఫ్‌లో చీడపీడల నివారణకు విత్తన శుద్ధి ఎంతో అవసరమన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త హరికుమార్, కోటేశ్వరరావు, కల్యాణి, ఆమని తదితరులు పాల్గొన్నారు.

20 శాతం కూలీ రేట్లు పెంచేందుకు నిర్ణయం

- వర్తకులు, కలాసీల మధ్య కుదిరిన ఒప్పందం

టెక్కలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రతి రెండేళ్లకు ఒకసారి కూలీల ధరల పెంపులో భాగంగా సోమవారం వర్తకులు, కలాసీల సంఘ నేతల మధ్య చర్చలు నిర్వహించారు. 20 శాతం కూలీ రేట్లు పెంచేందుకు వర్తకులు ప్రకటిం చగా కలాసీ సంఘ నేతలు అంగీకరించారు. స్థానిక వైశ్య చౌల్ట్రీ భవనంలో వైశ్య, వర్తక సంఘం అధ్యక్షుడు లాడి శ్రీనివాసరావు, కలాసీ సంఘం అధ్యక్షుడు కె.జానీ తదితరులతో సమావేశం నిర్వహించారు. అట్టపెట్టెలు, బియ్యం, నూనెలు, కిరాణా, పైపులు, ఎరువులు, విత్తనాలు, బెల్లం దిమ్మలు, సిమెంట్ బస్తాలు, సిమెంట్ రేకులు తదితర 33 రకాల సామగ్రికి సంబంధించి 20 శాతం కూలీ పెంపుదలకు అంగీకారం కుదిరింది. సమావేశంలో వర్తక సంఘం ప్రతినిధులు డోకి రాజేష్, మోనింగి గోవింద్, దోని కొండలరావు, తంగుడు శంకర్, వైశ్యరాజు గోవిందు, కలాసీల సంఘ ప్రతినిధులు యలమంచిలి బాలరాజు, ఎల్.వేణు గోపాల్, మండలి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి చానల్‌పై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

నరసన్నపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరుస్తూ సాక్షి మీడియాలో పొలిటికల్ ఎనలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడిన తీరు దారుణమని, అతనిపైనా ప్రసారంచేసిన సాక్షి చానల్‌పైనా చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి బలగ భారతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పోగోటి ఉమామహేశ్వరి, మాజీ సర్పంచ్ ఉణ్న రాజశ్రీ, పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి గురుగుబిల్లి ఝాన్సీ, పుచ్చల కల్పన పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 సాధనకు కృషి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ప్రత్యేకాధికారి లావణ్య, అధికారులు

నరసన్నపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆలోచనలకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు ప్రతీ ఒక్క అధికారి కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. సోమవారం సీఎం చంద్రబాబు అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే తహసీల్దార్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనకు అధికారులు పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ కలెక్టర్ లావణ్య, తహసీల్దార్లు ఆర్.సత్యనారాయణ, జె.రామారావు, శ్రీనివాసరావు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

పాతపట్నం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్ ఎన్ వీ శ్రీధర్‌రాజా, తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, ఎంపీడీవో పి.చంద్రకుమారి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు, అధికారులు

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా చర్యలు

టెక్కలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎం.కృష్ణ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వైద్యా ధికారులు, ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మెళియాపుట్టి, హిరమండలాల్లో ఫిమేల్ రేషియో తగ్గడంపై పరిశీలన చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ మేరీ కేథరిన్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా లక్ష సంతకాలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పలాస, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో నిర్మించతలపెట్టిన కార్గో ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా లక్ష సంతకాలను సేకరిస్తున్నట్టు ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు కాశీబుగ్గలోని ప్రైవేటుకల్యాణ మండపంలో వివిధ ప్రజా సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబ రేషన్ నాయకుడు మద్దిల రామారావు, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు మాట్లాడారు. కార్గో ఎయిర్‌పోర్టుకు బలవంతంగా భూములు ఎందుకు సేకరిస్తున్నారో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పర్యావరణ దినోత్సవం నాడు కేంద్ర మంత్రి మొక్కలు నాటుతూ.. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గాను లక్షలాది మొక్కలు ధ్వంసం చేసేందుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు. జిల్లా ప్రజలెవరైనా ఎయిర్ పోర్టు కావా లని అడిగారా, ఎవరి ప్రయోజనాల కోసం దీనిని చేపడుతున్నారని ప్రశ్నించారు. జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని, పలాస నుంచి ఇతర ప్రాంతాలకు రైళ్లు వేయాలని ఈ సంద ర్భంగా డిమాండ్ చేశారు. సమావేశంలో పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, జోగి అప్పారావు, ఎన్.గణపతి, తెప్పల అజయ్‌కుమార్, కొర్ల హేమారావుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేయాలి

పలాస, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాలలను తక్షణం సీజ్ చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కాశీబుగ్గలో అనుమతి లేని ఓ పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. విద్యా సంస్థల్లో దోపిడీ జరుగుతోందన్నారు. ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు తల్లిదండ్రుల నుంచి దండుకుంటున్నారని ఆరోపించారు. తక్షణం ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్య క్షుడు సూర్య, విజయ్, చిరు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. సోమవారం రాత్రి నిమ్మాడలో టీడీపీ కార్య కర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ని గద్దె దించి కూటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించిన ఈ ఏడాదిలో ప్రజలు ఎంతో సంతో షంగా ఉన్నారని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మెగా డీఎస్సీ, మత్స్యకార చేయూత, ఉచిత గ్యాస్‌సిలిండర్లు, పింఛన్ల పెంపు తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సీసీ, బీటీ రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టామన్నారు. వీటన్నింటిని ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, బగాది శేషగిరి, జీరు భీమారావు, కింజరాపు ప్రసాద్, ఎల్ఎల్ నాయుడు, మామిడి రాము, హనుమంతు రామకృష్ణ, రెడ్డి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం

పోలాకి/నందిగాం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం జిల్లా కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. పోలాకి మండలం ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థినులు శృంగారం శ్రీవల్లి (మబగాం), రుంకు సుష్మిత (దీర్ఘాశి), నందిగాం మండలం నుంచి గిన్ని అనుష్క, బాలక జశ్వంత్‌సాయి, యానాది దివ్య, సవర లోకేశ్ అవార్డులను అందు కున్నారు. వీరికి రూ.20 వేల నగదు, మెడల్, ప్రశంసాపత్రం అందించారు. విద్యార్థులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఈవో తిరుమల చైతన్య తదితరులు అభినందించారు.

- సోంపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): షైనింగ్ స్టార్ అవార్డులకు సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి అరుణ్ డొలాయ్, బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కొండా మీనాక్షి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.20 వేలు నగదు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు ఎ.మోహన్‌రావు, ఎల్.మోహనరావు, ఏజీఎంవో రజనీ కుమారి తదితరులు అభినందించారు.
- కంచిలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కంచిలి బీసీ కాలనీకి చెందిన డి.సాయి శిరీష షైనింగ్ స్టార్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా అధ్యాపకులు అభినందించారు.

పురుషోత్తమ సాగరం ఆక్రమణలు తొలగించాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలోని పురుషోత్తమ సాగరంలో ఆక్రమణలు తొలగించి సాగునీరందించాలని స్థానిక రైతు పీత రమణబాబు కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. సోమవారం గ్రీవెన్స్ నిర్వహించి వినతులు స్వీకరించారు. పాతపట్నం పంచాయతీ పరిధి విద్యానగర్‌లో ప్రధాన కాలువలపై అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, దర్యాప్తు చేయాలని స్థానికుడు టి.రామ్మూర్తి అర్జీ అందజేశారు. తన పొలానికి దగ్గరగా ఉన్న ప్రియాంక గ్రానైట్స్ క్వారీ పేలుళ్ల వల్ల రాళ్లు తన పొలంలో పడుతున్నాయని, తనకు న్యాయం చేయాలని బొరిగిపేటకి చెందిన రేణంకి అప్పన్న కోరారు. మొత్తం 9 వినతులు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్

పలాసరూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కాంట్రగడ గ్రామంలో ఏడాది నుంచి వివాదంలో ఉన్న స్థలాన్ని ఆర్డీవో వెంకటేష్ సోమవారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో ఆ స్థలంలో జగనన్న కాలనీని నిర్మించేందుకు సూచించారు. అయితే ఆ స్థలం ప్రైవేటు వ్యక్తులదని, ఇళ్ల నిర్మాణం ఎలా చేపడతారని కొందరు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ స్థలం మీదుగా పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని స్థానిక రైతులు ఆర్డీవోకి ఇటీవల వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడకు చేరుకున్న రైతులతో మాట్లాడి వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. దీనిపై పూర్తి పరిశీలన చేపట్టడం జరుగుతుందని ఆర్డీవో వెంకటేష్ తెలిపారు. ఆయనతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తలసేమియా బాధితురాలికి రక్తదానం

పలాస, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి శశిప్రియకు మొగిలిపాడు గ్రామానికి చెందిన పుణ్యవతి రక్తదానం చేశారు. ఆ నలుగురు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినెలా బాలికకు రక్తాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పుణ్యవతి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ట్రస్టు ప్రతినిధులు అభినందించారు.

ఆక్రమణదారులకు నోటీసులు

నరసన్నపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పాలకర్ర, రాత్రి కర్ర చెరువుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన 53 మందికి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. సంబంధిత చెరువు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఎన్‌జీటీలో కేసు వేయడంతో ఇటీవల ఆర్డీవో సాయిప్రత్యూష పరిశీలించి ఆక్రమణదారులకు నోటీసులివ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నోటీసులిచ్చారు. ఆక్రమణదారుల నుంచి లిఖితపూర్వకంగా సమాధానం స్వీకరించి నివేదికను ఉన్నతాదికారులకు అందిస్తామని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.

సీసీ రోడ్డు మంజూరు చేయండి

పలాస, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం కాలనీ వేణుగోపాలస్వామి ఆలయం ఎదు రుగా ఉన్న వీధిలో రహదారి, కాలువ నిర్మాణం చేపట్టాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్, వార్డు ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ ఎన్.రామారావుకు సోమవారం వినతిపత్రం అందించారు. మునిసిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. 20 ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని జీవి స్తున్నామని, ఇప్పటి వరకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. పరిశీలన చేసి తక్ష ణం తగు చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తం 11 వినతులు వివిధ సమ స్యలపై వచ్చాయని, వాటిని ఆయా విభాగాలకు పరిష్కారం నిమిత్తం పంపి నట్లు ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

హిరమండలం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం ధనుంజయరావు అన్నారు. సోమవారం హిరమండలం మండలం గులుమూరులో ప్రకృతి వ్యవసాయ పంట సాగు క్షేత్రాన్ని పరిశీలించారు. రైతులకు తగిన మెలకువలు, సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రాములమ్మ, రైతులు పాల్గొన్నారు.

12లోగా ఆరోతరగతి ప్రవేశాలు

పోలాకి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఈదులవలస మోడల్ స్కూల్‌లో ఆరోతరగతి ప్రవేశాలు ఈ నెల 12వ తేదీలోగా జరగాలని, దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఇప్పటికే సమాచారం ఇచ్చామని, ఒరిజినల్ సర్టిఫికేట్లు, హాల్‌టికెట్‌తో హాజరుకావాలన్నారు. సకాలంలో హాజరు కాకుంటే సీటును రద్దు చేసే అవకాశం ఉందన్నారు.

రేపు మండల సమావేశం

జలుమూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన జరుగు సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. అలాగే అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక చేయూత

నందిగాం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని డీఎల్‌పీవో గోపీబాల అన్నారు. సోమవారం నందిగాంలో కుట్టుశిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో కుట్టు శిక్షణ అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం, టి.ఉమా మహేష్, బి.గిరిబాబు, అధికారులు కుమార్ పట్నాయక్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గ్రామదేవత ఉత్సవాలు



కోలాటం ప్రదర్శిస్తున్న దృశ్యం

నందిగాం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రతాపవిశ్వనాథపురం, మదనాపురం గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు రెండోరోజు సోమవారం సందడిగా సాగాయి. పగటి వేషాలు, కోలాటం, కాళికా నృత్యాలతో వేషధారణలు ఆకట్టుకున్నాయి. గ్రామదేవతలకు మహిళలు ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. పీపీపురంలో ఆదివారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. సత్యహరిశ్చంద్రునిగా కణితి సూర్యనారాయణ, నక్షత్రకుడిగా వాసునాయుడు, చంద్రమతిగా పద్మావతి తమ పాత్రల్లో జీవించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

మర్రి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మెళియాపుట్టి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో రెండు రోజులుగా మర్రి పోలేరమ్మ సంబరాలు ఆనందోత్సాహాల నడుమ జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం అమ్మ వారిని ఊరేగించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



పూజలందుకుంటున్న పోలేరమ్మ